క్లుప్తంగా

నేలమట్టమైన తోటలు పరిశీలన

అశ్వారావుపేటరూరల్: ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలులతో నేలమట్టమైన తోటలను ఆదివారం సర్పంచ్ జోత్స్నబాయి పరిశీలించారు. మండల పరిధిలోని ఊట్లపల్లి పంచాయతీ పాపిడిగూడెం గ్రామానికి చెందిన రైతులు బద్దె మురళీమోహన్, బద్దె సురేష్, తగరం చుక్కమ్మ అనే రైతులు సాగు చేస్తున్న కాకర తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు ఆరు ఎకరాల్లో ఉన్న తోట పందిళ్లు గాలి కారణంగా నేలవాలిపోయి పడిపోగా, తీరని నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ నేలమట్టమైన కాకర తోటలను పరిశీలించి, ఉద్యాన శాఖ ద్వారా నష్ట పరిహారం వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఆమెతోపాటు వార్డు సభ్యులు, రైతులు ఉన్నారు.

స్వర్ణహారం బహూకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని డిగ్రీ కాలేజ్ సెంటర్‌లోని సాయి బాబావారికి ఓ భక్తుడు ముత్యాల స్వర్ణ హారాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఏపీలోని గుంటూరు సమీపంలోని మంగళగిరికి చెందిన మండ శ్రీనివాస్ ఆదివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి హారాన్ని అలంకరించారు. సుమారు రూ.25 వేల హారంతో పాటు స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి కుంచాల రమేష్, సుధాకర్, సరిత, డింపుల్, సాకేత్, కార్తికేయ పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలోని ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కింద కంటి ఆపరేషన్ ఉచితంగా చేయనున్నట్లు మణుగూరు మండల కంటి వైద్యులు డాక్టర్ జి.సంజీవరావు తెలిపారు. ఆదివారం మణుగూరు ఏరియా ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో కంటి శుక్లాలు ముదిరిన వారు సోమ, బుధ వారం నాడు మణుగూరు ఏరియా ఆస్పత్రికి వచ్చి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు తప్పకుండా తీసుకొని రావాలని సూచించారు. కంటి పరీక్షలు చేసుకున్న వ్యక్తికి అద్దాలు అందించారు.

అమ్మవారికి పూజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జాతర ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకారణలో పాటు ప్రత్యేక పూజలును ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు హరిచంద్ర నాయక్, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

బూర్గంపాడు: మోరంపల్లిబంజరలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కొత్తగూడెంకు చెందిన ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులందరికి ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు అందించారు. విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఫ్రెండ్స్ యూత్ ప్రతినిధులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, బాలు, అనురాధ, భాస్కర్, ఫ్రెండ్స్ యూత్ ఫౌండేషన్ ఫౌండర్ సీహెచ్ శ్రీకాంత్, సభ్యులు శివ జస్సు, నాని, మోహన్, నందు, చేయూత ట్రస్ట్ ఫౌండర్ జక్కిరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోడోయాత్రకు కాంగ్రెస్ శ్రేణులు

మణుగూరురూరల్: ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి అధ్యక్షతన జరిగే హాత్ సే హాత్ జోడో యాత్ర, బహిరంగ సభలకు మణుగూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని గురిజాల గోపి జెండా ఊపి ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ నాయకులు ముక్కెర లక్ష్మణ్, కంపా రవి, పాపారావు, ఎన్.సతీష్‌రాజు, కొడెం సాంబ, కిరణ్ మోహన్, ముత్తయ్య, ఎండి.షరీఫ్, నూరుద్దీన్, మాధవరెడ్డి, రామ్‌లక్ష్మణ్, కృష్ణవంశీ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేత

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీకి చెందిన వసంతమ్మ అనే వృద్ధురాలికి వీ ఫర్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. నిరుపేద వృద్ధులకు, పేదలకు సహాయం చేసేందుకు తమ ట్రస్ట్ అందుబాటులో ఉంటుందన్నారు.

అద్దె ఇళ్లు.. అరకొర సౌకర్యాలు

- అంగన్‌వాడీ కేంద్రాల దుస్థితి ఇది..
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు
- సొంత భవనాలు నిర్మించాలని వేడుకోలు


రాళ్లగూడెంలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

చర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకు నిర్వహించబడుతున్న ఈ కేంద్రాలకు సొంత భవనాలు లేక, కొనసాగుతున్న అద్దె భవనాల్లో వసతులు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చర్ల మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భవనాలలో కొనసాగుతున్నాయి. అక్కడ సరైన సౌకర్యాలు కూడా లేకపోవడంతో చిన్నారులను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు వారి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. బాలింతలు, గర్భిణుల పరిస్థితి సైతం అలాగే ఉంది.

48 కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లోనే..

చర్ల మండలంలో 112 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 79 మెయిన్, 33 మినీ కేంద్రాలున్నాయి. వీటిలో కేవలం 64 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా మిగిలిన వాటికి భవనాలు లేవు. భవనాలు లేకుండా ఉన్న 48 కేంద్రాలలో 25 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతుండగా, మరో 23 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయ భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు చెల్లిస్తున్న రుసుం అంతంత మాత్రంగానే ఉండడం, అవి కూడా ప్రతి నెలా సక్రమంగా చెల్లించకపోతుండడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను (ఇళ్లు) అద్దెకు ఇచ్చిన యజమానుల నుంచి ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మరుగుదొడ్లు లేవు.. తాగునీరుండదు..

ప్రభుత్వ భవనాలు లేక అద్దె భవనాలు, ప్రభుత్వ ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ప్యాన్లు వంటివి లేకపోవడంతో కేంద్రాలకు వస్తున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయా గ్రామపంచాయతీల నుంచి తాత్కాలికంగా తాగునీటిని పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ అది అంతంత మాత్రంగానే కొనసాగుతోంది.

ఏళ్ల తరబడి ఎదురు చూపులు..

చర్ల మండలంలో అద్దె, ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న 48 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణం కోసం ఆయా గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వారి తల్లిదండ్రులు ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నారు. అద్దె భవనాలు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునేందుకు అనువైన స్థలం లేకపోవడంతో కేంద్రాలకు వెళ్లేందుకు బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఆసక్తిని చూపడం లేదు. ఏళ్ల తరబడిగా భవనాల నిర్మాణాల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ వాటిని నిధులు మంజూరు కాకపోవడం, నిర్మాణాలకు నోచుకోకపోవడంతో జనానికి ఏళ్ల తరబడిగా ఎదురు చూపులే మిగులుతున్నాయి.

సౌకర్యాలేమీ లేవు..



గతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని కూల్చివేశారు. దీంతో కేంద్రం నిర్వహణ కష్టంగా మారడంతో.. అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న గ్రంథాలయ భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో మంచినీటి నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు. దీంతో కేంద్రానికి వచ్చే తల్లులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు కేటాయించి సొంత భవనం నిర్మించాలి.

– తెల్లం రాంబాయి, అంగన్‌వాడీ టీచర్, దేవరాపల్లి-1

ఉన్నతాధికారులకు నివేదించాం..



చర్ల మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పడుతున్నారని గ్రహించాం. అద్దె భవనాలో సౌకర్యాలు లేని మాట వాస్తవమే. గ్రామాల్లో సౌకర్యాలు ఉన్న భవనాలు లేకపోవడంతో అరకొర సౌకర్యాలు ఉన్న భవనాల్లోనే అద్దె ప్రాంతిపదికన కేంద్రాలను నిర్వహిస్తున్నాం. బిల్లులు మంజూరు కాకపోతుండడంతో నెల నెలా అద్దె చెల్లించలేకపోతున్నాం. ఉన్నతాధికారులతో పాటు ప్రతినిధులను నివేదికలు పంపించాం. త్వరలోనే భవనాలు మంజూరయ్యే అవకాశం ఉంది.

– పి.చైతన్య, సీడీపీఓ, ఐసీడీఎస్ చర్ల ప్రాజెక్ట్

సారపాక సంతలో రగడ

- ఫీజు పెంపుపై వ్యాపారుల ఆందోళన
- కాంట్రాక్టర్, వ్యాపారులకు మధ్య వాగ్వాదం


వాగ్వాదానికి దిగిన కాంట్రాక్టర్, వ్యాపారులు

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాక సంత నిర్వహణ వివాదస్పదంగా మారుతోంది. ఆదివారం వ్యాపారులకు, సంత నిర్వహణ కాంట్రాక్టర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు గంటల పాటు ఫీజుల పెంపుపై రగడ నెలకొంది. సంత నిర్వహణకు గాను గురువారం సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. రూ.5 లక్షలకు గత ఏడాది కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తే ఈ ఏడాది కూడా కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు.

రానున్న ఏడాది కాలం ఈ కాంట్రాక్టరే సంత నిర్వహణ బాధ్యతలు తీసుకుంటారు. అయితే వేలం పాట నిర్వహించిన తరువాత మొదటి వారమే చిరువ్యాపారులు, దుకాణాదారుల నుంచి ఎక్కువ ఫీజు వసూళ్లకు కాంట్రాక్టర్ డిమాండ్ చేశారు. దీంతో వ్యాపారులకు కాంట్రాక్టర్‌కు మధ్య రెండుగంటల పాటు వివాదం చోటుచేసుకుంది. పెంచిన ఫీజు చెల్లించలేమని వ్యాపారులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శికి కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేశారు. సంతకు అనువైన స్థలం కూడా కేటాయించకపోవడంతో రోడ్లపక్కనే సంత నిర్వహిస్తున్నామని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేవని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం వారం ఫీజులు పెంచుతూ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చిరువ్యాపారులను చిన్నచూపు చూస్తు హేళనగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. సంత వేలం ధర పెరిగిన కారణంగానే ఫీజులు పెంచామని కాంట్రాక్టర్ వివరణ ఇచ్చాడు. అయితే ముందుగా నిర్ణయించిన ధరల ప్రకారమే వ్యాపారుల నుంచి ఫీజు వసూళ్లు చేయాలని పంచాయతీ కార్యదర్శి మహేష్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ధరలు పెంచకుంటే సంత నిర్వహించలేమని కాంట్రాక్టర్ పంచాయతీ కార్యదర్శితో తేల్చిచెప్పాడు. ఈ క్రమంలో మళ్లీ వ్యాపారులకు, కాంట్రాక్టర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పంచాయతీ కార్యదర్శి వ్యాపారులకు నచ్చజెప్పి గతంలో ఇచ్చిన ఫీజులనే చెల్లించమని సూచించాడు. కాంట్రాక్టర్‌కు నోటీసులను జారీ చేస్తున్నామని తెలిపారు.

ఆరు సెక్టార్లు.. ముగ్గురే సూపర్‌వైజర్లు

అశ్వాపురం: ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ పరిధిలో అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో ఆరు సెక్టార్లు ఉండగా ముగ్గురు సూపర్‌వైజర్లు మాత్రమే ఉన్నారు. దీంతో రెండు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. అశ్వాపురం మండలంలో అశ్వాపురం, కల్యాణపురం, మల్లెలమడుగు, బూర్గంపాడు మండలంలో సారపాక, మోరంపల్లిబంజర, ముసలిమడుగు సెక్టార్లలో 150కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ముగ్గురు సూపర్‌వైజర్లలో ఒక్కొక్కరికి రెండు సెక్టార్లు 30కి పైగా అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలున్నాయి. ఈ నేపథ్యంలో దూరభారం కావడంతో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించలేకపోతున్నారు. అశ్వాపురం మండలంలో గతంలో సూపర్‌వైజర్‌గా పని చేసిన హసీనాభేగాన్ని డిప్యుటేషన్‌పై కొత్తగూడెం డీడబ్ల్యూఓ కార్యాలయానికి బదిలీ చేయగా ఇద్దరు సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, జగదాంబను ఇటీవల చర్ల, దుమ్ముగూడెం బదిలీ చేశారు. అశ్వాపురం మండలానికి చెందిన ముగ్గురు బదిలీలపై వెళ్లడంతో బూర్గంపాడు మండలానికి చెందిన ముగ్గురు సూపర్‌వైజర్లకు మూడు సెక్టార్లు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు సెక్టార్లు ఉండటంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి మండలంలో మూడు సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేస్తే అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ సక్రమంగా జరిగే అవకాశం ఉంది.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సులక్షణ, అమరేందర్

అశ్వాపురం: మండలంలో పలువురు లబ్ధిదారులకు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. జగ్గారం గ్రామానికి చెందిన వి.గౌతమికి రూ.22,500, తరుములగూడెం గ్రామానికి చెందిన తేజావత్ నరేష్‌కు రూ.11,500, అణుశక్తినగర్ గ్రామానికి చెందిన నంద్రు రూపావతికి రూ.60 వేలు, ఎలకలగూడెం గ్రామానికి చెందిన కే.కమలమ్మకు రూ.21,500 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్‌లు సున్నం రాంబాబు, కలేటి నరసింహారావు, కమల, ఉపసర్పంచ్ ఆవుల వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ఎంపీపీ వీరభద్రం, సీనియర్ నాయకులు ఈదర సత్యనారాయణ, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, చుంచు రామ్మూర్తి, లంకెల రమేష్, ఎస్‌కే.నయీం, జావిద్, జిలాని ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు నష్టమేమీ లేదు..


సమావేశంలో మాట్లాడుతున్న అన్నె సత్యనారాయణమూర్తి

దుమ్ముగూడెం: పొంగులేటి ఆత్మీయ సమ్మేళనంతో మండలంలో బీఆర్ఎస్ పార్టీకి ఎటువంటి నష్టమూ లేదని, ప్రజాప్రతినిధులు కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడినంత మాత్రాన పార్టీ తగ్గదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు.

ప్రజాప్రతినిధులుగా గెలిపించిన గ్రామ స్థాయి నాయకత్వం పార్టీకి అండగానే ఉన్నారన్నారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నాయకత్వం పనిచేస్తుందని అన్నారు. తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వికలాంగ, వితంతు, వృద్ధాప్య, పెన్షన్లు, రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, మండలంలో గిరిజనుల సాగులో ఉన్న సుమారు 11000 ఎకరాల పోడు భూములకు సంబంధించి పట్టాలు ఇప్పించడం కోసం సర్వే పనులు పూర్తి చేసి త్వరలో పోడుసాగుదారులకు అందించనున్నమని అన్నారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి నలుగురు ఎంపీటీసీలు గెలిచారని, అందులో ప్రగలపల్లి ఎంపీటీసీ మాత్రమే పార్టీ నుంచి బయటకి వెళ్లారని, మిగతా ముగ్గురు పార్టీలోనే ఉన్నారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తలు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు కణితి రాముడు, జానీపాషా, తునికి కామేష్, కణితి లక్ష్మణ్, కెల్లా శేఖర్, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకూరి శ్రీకాంత్, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, సర్పంచ్-దిశ కమిటీ సభ్యుడు మట్ట వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ధనిన అప్పారావు, కతదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పొంగులేటి విరాళం

చంద్రుగొండ: మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో కొలువై ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయానికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.2.518 లక్షలను ఆదివారం విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉన్న విషయం తెలుసుకున్న ఆయన.. ఈ విరాళం అందించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, సారేపల్లి శేఖర్, బాణోత్ రాముడు పాల్గొన్నారు.

పర్ణశాల ఆలయంలో అంకురారోపణ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలో నవనీక ధ్వజారోహణ తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా మొదటి రోజు ఆదివారం అంకురారోపణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, ప్రతాపురం భార్గవచార్యులు ఆలయంలో ఉదయం అభిషేకాలు, అలంకరణల అనంతరం సాయంత్రం 6 గంటలకు ఉత్సవం ప్రారంభం సమయంలో స్వామివారికి తిరుమంజనం జరిగింది. అంకురారోపంలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం రక్షాబంధనం పరిసబ్ధక్షిణ రిత్విక్‌వరణం రక్షాబంధనం ముత్సాగ్రహణం నిర్వహించారు.

వైభవంగా గజ్జల పూజ

భద్రాచలంటౌన్: భద్రాచలం పుణ్యక్షేత్రంలోని శ్రీఅహోబిల మఠ శ్రీ నరసింహ స్వామివారి సన్నిధానంలో ఆదివారం శ్రీరామ నృత్యాలయ నాట్య విద్యార్థులకు గజ్జ పూజా మహోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి డాక్టర్ కృష్ణ చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ నృత్యాలయ గురువిణి భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలోని పీకే-1 సెంటర్‌కు చెందిన నాగరాజు అనే యువకుడు గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతనితో 2000-2002లో ఇంటర్‌మీడియట్ చదివిన స్నేహితులు అంతాకలిసి ఆదివారం నాగరాజు కుటుంబాన్ని కలిసి పిల్లలను ఓదార్చారు. రూ.11వేలు నగదు ఆర్థిక సహాయం అందించారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి తాము ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో మిత్రులు రవి, రమేష్, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ముస్లిం పేద వృద్ధ మహిళలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దార వెంకటేశ్వరరావు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. బియ్యం, పండ్లు, నగదు అందించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు యండి.షమీహుసేన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, వంకాయలపాటి బాబురావు, మల్లెం వెంకటేశ్వర్లు, రియాజ్, సలీం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నెల్లిపాకబంజర జెడ్పీ స్కూల్ 2001-02 బ్యాచ్ విద్యార్థులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం జెడ్పీ స్కూల్‌లో సమ్మేళనం కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని నెల్లిపాకబంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం సరదాగా జరుపుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడో స్థిర పడ్డ అందరూ ఒక చోటకు చేరి గత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. నాటి సంగతులను చర్చించారు. ఒకరితో ఒకరు మాట్లాడుకుని ప్రస్తుత స్థితిగతులను పరిచయం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అందరూ రోజంతా ఉత్సాహంగా, సరదాగా గడిపారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధి పట్ల వ్యవహరించిన తీరును నిరసిస్తూ ఆదివారం చర్లలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ గీదా కోదండరామయ్య మాట్లాడారు. భారత్ జోడో యాత్రతో దేశ వ్యాప్తంగా రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేని బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యురాలు మడకం పద్మజ, కిసాన్ కేత్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇందుల బుచ్చిబాబు, నాయకులు రుంజా రాజా, కొప్పుల తిరుపతి, కె.వెంకట్, సీహెచ్ సుదాకర్, రామకృష్ణ, రాజేష్, కె.రజిని, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు అభినందనీయం

అశ్వాపురం: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో శ్రీ సురక్ష మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమని అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో శ్రీ సురక్ష మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సీఐ, జెడ్పీటీసీ, ఎంపీపీ ప్రారంభించారు. శిబిరంలో ఆస్పత్రి వైద్యుడు, జనరల్, క్రిటికల్ కేర్ వైద్య నిపుణుడు డాక్టర్ లోకేష్, గైనకాలజిస్ట్ సూరపనేని శ్రీక్రాంతిలు 400 మందికి వైద్య చికిత్సలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా గుండెకు సంబంధించిన ఈసీజీ, రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, ఉపసర్పంచ్ చందులాల్, దిశ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, హెచ్ఎం శ్రీనివాస్, ఆస్పత్రి మేనేజర్ కొప్పుల మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అశ్వారావుపేటకు చెందిన జీవన శ్రీ మల్టీ స్పెషాలటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేయగా, స్థానిక సర్పంచ్ కొడిమి సీత చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వైద్యులు పూర్ణ చంద్, భవ్య సుధ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ వల్లెపు తిరుపతిరావు, గ్రామస్తులు పుట్ట సత్యనారాయణ, బండి చెన్నారెడ్డి, శ్రీను, ఆస్పత్రి సిబ్బంది బండి సురేష్, ఖాసీం, కిషోర్, బిందు, రత్న, వాణి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మూలనపడ్డ సూచిక బోర్డులు



రహదారుల వెంట వాహనదారులకు సమాచారం కోసం ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కానరావడం లేదు. ముఖ్యంగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని కూడలిలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు పూర్తిగా ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు గతంలో వీచిన గాలి దుమారానికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో సూచిక బోర్డులో సమాచారం లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రుల సమయంలో ప్రయాణించే వారిపై ఆ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది.

– అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: లక్మానాయక్, ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్ నంబర్: 9866309579